నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 25 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

## మున్సిపాలిటీల అభివృద్ధిపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హుజూర్‌నగర్, జూన్ 24 : సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ మున్సిపాలిటీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై సోమవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోదాడ మున్సిపాలిటీ పరిధిలో పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధికి రూ.8కోట్లు, టౌన్ హాల్ నిర్మాణానికి రూ.6కోట్లు , ఖమ్మం ఎక్స్ రోడ్డు అభివృద్ధికి రూ.50 లక్షలు, మున్సిపాలిటీ పరిధిలో హైదరాబాద్ – విజయవాడ రోడ్డులో స్వాగత తోరణాలకు రూ.1.10 కోట్లు, చెరువు కట్ట బజార్ నుంచి అనంతగిరి రోడ్డు వరకు అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.4.40 కోట్లు విడుదల చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కోదాడ మున్సిపాలిటీలో అదనపు అవుట్ సోర్సింగ్ శానిటరీ సిబ్బంది ఏర్పాటుకు ఆమోదం, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ఈద్గాహ్, శ్మశాన వాటికలు, సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.3కోట్లు, గోవిందాపురంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు, దోబీఘాట్ నిర్మాణానికి రూ.2కోట్లు, మున్సిపాలిటీకి స్వీపింగ్ మిషన్, నేరేడుచర్ల మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు రూ.15కోట్లు విడుదల చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఎంఏ అండ్ యుడీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పెచ్చులూడిన స్లాబ్

మునుగోడు, జూన్ 24 : మండల కేంద్రంలోని పురాతనమైన ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయ భవనం సోమవారం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో స్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. డీఈఈ కుర్చీ పక్కనే పెచ్చులు పడ్డాయి. సాయంత్రం కావడంతో అప్పటికే అధికారులు, ఉద్యోగులంతా విధులు ముగించుకొని ఇండ్లకు వెళ్లిపోయారు. దాంతో పెను ప్రమాదం తప్పింది.



ఆర్డ్‌బ్ల్యూఎస్ కార్యాలయంలో ఊడి కింద పడిన స్లాబ్ పెచ్చులు

# డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించండి

### భువనగిరిలో లబ్ధిదారుల ఆందోళన

### అఖిలపక్షం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ముట్టడి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 24 : కేసీఆర్ ప్రభుత్వం పేదల కోసం భువనగిరి పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించాలని లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. సోమవారం ఉదయం అఖిలపక్షం ఆధ్వర్యంలో పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తాసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 444 మంది పేదలకు అందించేందుకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించి లబ్ధిదారులను గుర్తించి పట్టాలు కూడా అందించింది. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఆరు నెలలైనా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డబుల్ ఇండ్లను కేటాయించడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో ఇండ్ల మరమ్మతులు పూర్తిచేసి పంపిణీ చేయకుంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అఖిల పక్షం నాయకులు హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కే జెండగే, తహసీల్దార్ అంజిరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ భువనగిరి పట్టణాధ్యక్షుడు రత్నపురం బలరాం, మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట నర్సింహ, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, వివిధ పార్టీల నాయకులు రాంచంద్రయ్య, అశోక్, బలరాం, శ్రీనివాస్‌రెడ్డి, రహీం, నితీష్, సూరజ్, సైదులు, సుభాష్, డబుల్ బెడ్రూం ఇండ్ల కమిటీ అధ్యక్షుడు చేగూరి సుధాకర్ పాల్గొన్నారు.



భువనగిరి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులు

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 24 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజావాణిలో 96 ఫిర్యాదులు స్వీకరించగా.. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 73, ఉపాధి కల్పన – 3, విద్యాశాఖ – 4, పంచాయతీరాజ్ శాఖ–2, పౌరసరఫరాల శాఖ–2, గురుకుల పాఠశాల – 2, అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖ, ల్యాండ్ రికార్డ్స్, ఎంపీడీఓ, వైద్య శాఖ, మత్స్యశాఖ, ట్రాన్స్‌కో, మున్సిపాలిటీ, ఎస్సీ సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జడ్పీ సీఈఓ ఎన్.శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, సూపరింటెండెంట్ పార్థసారథి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

భువనగిరి కలెక్టరేట్, జూన్24: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట వేర్వేగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కారునుంచి రూ.2లక్షలు చోరీ

చౌటుప్పల్‌రూరల్, జూన్24 : దాబా ఎదుట నిలిపి ఉంచిన కారులోంచి రూ.2లక్షలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలోని శనివారం రాత్రి చోటుచేసుకోగా.. సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పండ్రేగుపల్లి గ్రామానికి చెందిన కత్రాల ఉపేందర్ తన అమ్మమ్మ తిరుపతమ్మను ఈ నెల 22న చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించాడు. తన బంధువులు ఇచ్చిన రూ.2 లక్షలను తీసుకొని అదేరోజు రాత్రి కారులో ఖమ్మం బయల్దేరాడు. మార్గ మధ్యంలో దిల్‌సుఖ్‌నగర్ వద్ద తన స్నేహితుడు గోవిందరావుతో కలిసి మద్యం సేవించాడు. రాత్రి 10 గంటల సమయంలో చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని స్వాతి దాబావద్ద ఆగి టిఫిన్ చేసిన అనంతరం డ్రైవర్‌తో కలిసి కారులోనే నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో లేచి చూడగా డబ్బులు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రహించి సోమవారం చౌటుప్పల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

## ఆర్టీసీ ఆర్‌ఎం రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్‌ఎం రాజశేఖర్

నల్లగొండ సిటీ, జూన్ 24 : ఆర్టీసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ మేనేజర్‌గా ఎం.రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన ఎస్.శ్రీదేవి సీటీఎంగా బస్ భవన్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో బస్ భవన్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌ను ఉమ్మడి నల్లగొండ ఆర్‌ఎంగా బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆర్‌ఎం రాజశేఖర్‌కు డీవీఎంలు శివశంకర్, మాధవి, డీఎం రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలో 62శాతం ఉత్తీర్ణత

భువనగిరి అర్బన్, జూన్ 24 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ గ్రూప్‌లకు సంబంధించి 3,696 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 2,318 మంది (62.72శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 1,091 మంది బాలురు, 1,227 మంది బాలికలు ఉన్నారు. సెకండియర్‌లో 2,333 మంది విద్యార్థులకుగాను 1,316 మంది (56.41 శాతం) పాస్ అయ్యారు. ఇందులో 734 మంది బాలురు, 582 మంది బాలికలు ఉన్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి రమణి తెలిపారు.



నల్లగొండ జనరల్ ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

## జూడాల సమ్మె

### ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని నిరసన

- అత్యవసర సేవలు మినహా ఇతర అన్ని రకాల సేవలు నిలిపివేత
- జూనియర్ డాక్టర్ల సమ్మెతో ఇబ్బందులు పడ్డ రోగులు

నీలగిరి, జూన్ 24 : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు (జూడాలు) సమ్మె సైరన్ మోగించారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతున్నారని, తమకు రావాల్సిన ప్రభుత్వ గ్రాంట్లు ఇవ్వడం లేదని సోమవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల అవరణలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలు మినహా అన్నింటినీ నిలిపివేశారు. ఎమర్జెన్సీ సేవలు, పరీక్షల్లో ఉన్న జూడాలు మినహా మిగిలిన సుమారు మూడు వందల మందికి పైగా జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు. జూడాల సమ్మెతో ఓపీకి వచ్చిన రోగులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ మెడికల్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని పలు రకాలుగా నిరసనలు తెలిపినా స్పందన రాకపోవడంతో సమ్మెకు దిగినట్లు తెలిపారు. గ్రీన్ చానల్‌లో జూనియర్ డాక్టర్ల (హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, సీనియర్ రెసిడెంట్ల) స్టైఫండ్‌ను సకాలంలో పంపిణీ చేయకపోవడం వల్ల ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూనియర్ డాక్టర్లందరికీ ప్రతి నెలా 10వ తేదీలోపు స్టైఫండ్ జమ చేయాలని కోరారు. స్టైఫండ్‌ను సకాలంలో విడుదల చేయడం కోసం గ్రీన్ చానల్ నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రవాణా కోసం కొత్త బస్సుల సేకరణతోపాటు ఆసుపత్రిలో నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కళాశాలలో మూసివేసిన లైబ్రరీని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్ అందలేదని, క్యాజువాలిటీలో ఇంటర్న్ రూమ్స్, వాష్‌రూమ్స్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర చికిత్స కోసం మందులు కూడా అందుబాటులో ఉంచడం లేదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే అబ్దుల్ సమద్, గగన్ పెరుమాండ్ల, ఉపాధ్యక్షులు రుత్విక్, సత్యసాయి కృష్ణ, రేవంత్, జాహ్నవి, జాయింట్ సెక్రటరీలు బాలు వేమిరెడ్డి, షేక్ షాబాజ్, హరీశ్, దీపిక, కోశాధికారి ఇంద్రాణి పాల్గొన్నారు.

## ప్రజావాణికి వసతులు కరువు

- నకిరేకల్‌లో చెట్ల కిందే దరఖాస్తుల రాత



నకిరేకల్ ఎంపీడీఓ కార్యాలయంలో కుర్చీలు లేకపోవడంతో చెట్ల కిందే కూర్చొని దరఖాస్తు రాసుకుంటున్న అర్జీదారులు

నకిరేకల్, జూన్ 24 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సరైన వసతులు కల్పించలేదని అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కుర్చీలు వేయలేదని, మంచి నీటి సౌకర్యం కల్పించలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి తమ సమస్యలు చెప్పుకొనేందుకు 42 మంది అర్జీదారులు రాగా.. సమావేశ మందిరంలో మూడు కుర్చీలు మాత్రమే వేశారు. దాంతో అర్జీదారులు నేలపైన, అరుగుల మీద, చెట్ల కింద కూర్చుని దరఖాస్తులు రాసే పరిస్థితి నెలకొంది. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండడంతో మంచినీళ్ల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది. సమావేశ మందిరంలో అధికారుల కుర్చీల వెనుక భాగంలో ఉన్న చాంబర్‌లో వాటర్ క్యాన్లను ఉంచారు. కార్యాలయ బయట ఆవరణలో ఉంచాల్సిన వాటర్ క్యాన్లను ఆఫీస్ చాంబర్‌లో పెడితే తాము ఎలా తాగాలని అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు రెండు మార్లు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయలేదు.

## బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు



జాతీయ సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సెమినర్ కన్వీనర్ ఆకుల రవి, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, టీసీఏ ప్రతినిధులు

- సైబర్ క్రైమ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఎంజీయూ జాతీయ సెమినార్‌లో వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు

రామగిరి, జూన్ 24 : బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, వాటిని వినియోగదారులు సక్రమంగా వినియోగించుకునేలా చైతన్యం చేయాలని బ్యాంకర్లు, కామర్స్ విద్యార్థులకు వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు సూచించారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రెస్యూస్ హైదరాబాద్ సహకారంతో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఈటీబీఎఫ్–2కే24) అంశంపై సోమవారం జాతీయ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వెస్ట్ బెంగాల్‌లోని ఎస్‌కేబీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రదీప్త బన్షీ, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాండ్యానాయక్, రాజస్థాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌కే టైలర్, ఎంజీయూ మాజీ వీసీ గంగాధర్, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఓయూ ప్రొఫెసర్ డి.చెన్నప్పతోపాటు పలు యూనివర్సిటీల ప్రొఫెసర్లు.. టీసీఏ వ్యవస్థాపకుడు, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ దివంగత వీసీ హెచ్.వెంకటేశ్వర్లు, సరస్వతీమాత చిత్రపటాలకు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ టెక్నాలజీతో అనేక అంశాల్లో మార్పులు వచ్చాయన్నారు. కొత్త టెక్నాలజీతో సైబర్ మోసాలు సైతం జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పి.పురుషోత్తంరావు, విశ్రాంత ప్రొఫెసర్ ప్రశాంతఆత్మ బ్యాంకింగ్, ఫైనాన్స్ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సాయంత్రం జరిగిన తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు హెచ్.వెంకటేశ్వర్లు మెమోరియల్ లెక్చరర్‌కు విశ్వనాథ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ హైదరాబాద్ సీఎండీ కె.శివకుమార్ హాజరై మాట్లాడారు. హెచ్.వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఎంజీయూ కామర్స్ టాపర్లకు ఏటా బంగారు పథకాలు అందించేందుకు రూ 2.5లక్షలు, హెచ్.వెంకటేశ్వర్లు స్మారక ఉపన్యాసాలు నిర్వహించేందుకు రూ.2లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మహమ్మద్ అలీముద్దీన్ బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. అంతకుముందు వివిధ యూనివర్సిటీల పరిశోధన విద్యార్థులు, ప్రొఫెసర్లు పంపిన వ్యాసాలతో రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ వ్యాసాలు అందజేసిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. సెమినార్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆకుల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జై.రవికుమార్, ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, అధ్యాపకులు నీలకంఠం శేఖర్, జి.రాంబాబు, రవిచంద్ర, పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనూరాధరెడ్డి, ఎంజీయూ వివిధ విభాగాల అధికారులు, వివిధ యూనివర్సిటీల పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.



ఫణిగిరి తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ విహారాలు

## ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో తవ్వకాలు పూర్తి

నాగారం, జూన్ 24 : సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తవ్వకాలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి 11న మొదలుపెట్టిన తవ్వకాలు ఈ నెల 19వరకు సాగినట్లు చెప్పారు. తవ్వకాల్లో 11 విహార గదులు, 6 పిల్లర్ల ఆకారంలో యూనివర్సిటీ, సమావేశ మందిరం, ఒక కుండలో 3,733 సీసపు నాణేలు, ధాన్యాగారం, పూసలు, విరిగిన శాసనాలు, పెంకు ముక్కలు లభ్యమయ్యాయి. తవ్వకాల్లో బయల్పడిన వాటిని పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి ఫణిగిరి మ్యూజియంలో భద్రపరిచారు. ఈ తవ్వకాల్లో 7,500 మంది కూలీలు భాగస్వాములయ్యారు.



తవ్వకాల్లో బయల్పడిన నాణేల కుండ